

31నే పింఛన్ల పంపిణీ : కమిషనర్


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఒక్క రోజు ముందుగానే డిసెంబర్ 31 వ తేదీన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటవ తేదీ నూతన సంవత్సరం కావడంతో ఈ నెల 31 వ తారీఖునే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. లబ్ధిదారులు అందరూ డిసెంబర్ 31న పింఛన్లు అందుకుని, ఆనందంతో నూతన సంవత్సరం లోకి అడుగుపెట్టాలని కమిషనర్ ఎన్. మౌర్య ఆ ప్రకటనలో అకాంక్షించారు.

భారతీయ విజ్ఞాన సమ్మేళనం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, క్యాంపస్

'సమగ్ర వికాసానికి భారతీయ చింతన' అనే భావంతో డిసెంబర్ 26 నుంచి 29 వరకూ నాలుగు రోజుల పాటు దేశంలోని 32 రాష్ట్రాల నుంచి, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చే 1250 మంది ప్రతినిధులతో భారతీయ విజ్ఞాన సమ్మేళనం వైభవంగా ప్రారంభమయ్యింది. అంగరంగ వైభవంగా శుక్రవారం జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని ప్రాంగణంలో ప్రారంభించారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్‌జీ భగవత్, గౌరవ అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు, డిఆర్‌డిఒ పూర్వ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, సిఎస్ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్, విజ్ఞాన భారతి జాతీయ అధ్యక్షులు డాక్టర్ శేఖర్ మాండే, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. డాక్టర్ సతీష్‌రెడ్డి అతిథులకు స్వాగతోపన్యాసం చేశారు. సిఎస్ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్‌మాండే విజ్ఞాన భారతి గొప్పతనాన్ని, లక్ష్యాలను, చేస్తున్న కార్యకలాపాలను, నాలుగు రోజుల భారతీయ విజ్ఞాన సమ్మేళనం ఉద్దేశ్యాన్ని వివరించారు. కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ ఈ విజ్ఞాన సమ్మేళం జాతీయ సంస్కత విశ్వవిద్యాలయంలో నిర్వహించడం గౌరవమని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం ప్రగతిపథంలో ముందుకు దూసుకెళుతుందని వివరించారు. భారతదేశం ఆయుధాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థితిగి ఎదిగందని, కరోనా సమయంలో భారతదేశీయ వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించిన ఘనత మనకుందని వివరించారు. పరిశోధన రంగంలో భారతీయులు ముందంజలో ఉన్నారని, ప్రస్తుతం భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో 35వ స్థానంలో ఉందని, 100 పరిశోధన పత్రికలలో 20 మనదేశం నుండే వెలువడుతున్నాయని, చైనా, అమెరికా తర్వాత 3వ స్థానంలో భారతదేశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రసాంకేతిక జ్ఞానాన్ని తెలుసుకోవాలని, అందుకోసం సైన్స్ అండ్ టెక్నాలజీ గ్రంథాలను భారతీయ ప్రాంతీయ భాషలలో అనువాదం చేస్తున్నామని చెప్పారు. మన భారతీయ జ్ఞానపరంపరను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.



శ్రీధర్‌వర్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబునాయుడు

ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిన దేశంగా పరిఢవిల్లిందని, ఎన్నో వేల ఏళ్ల క్రితమే అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో హరప్పా నాగరికత ద్వారా చాటి చెప్పాం అన్నారు. 2900 ఏళ్ల క్రితమే యోగాభ్యాసం చేశామని, ఇప్పుడు 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయని, యోగా పాటిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రధాని మోదీ నేతత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించాం అన్నారు. 2600 ఏళ్ల క్రితమే భారత దేశం ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించిందన్నారు. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన నిపుణులు మన భారత దేశం సొంతం అన్నారు. దక్షిణ భారత దేశంలో ఏడవ భారతీయ విజ్ఞాన్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్-1 స్థానంలో నిలుస్తుందన్నారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని మోహన్ భగవత్ చెబుతున్నారని, తానూ అదే చెబుతున్నా అన్నారు. ఇప్పుడు మన జనాభానే ఆస్తిగా మారిందన్నారు. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నామని, టెలికాం సంస్కరణలతో కనెక్టివిటీ పెరిగిందన్నారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎయిరో స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్క్ వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గూగుల్ పెద్ద ఎత్తున పెట్టుబడులను విశాఖలో పెట్టబోతోందన్నారు. ఈ సందర్భంగా ఇండియాస్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు.

ముఖ్య అతిథి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ జీ భగవత్ మాట్లాడుతూ భారతీయ దష్టి ధర్మదష్టి అని, ప్రతి ఒక్కరూ సుఖంగా జీవించాలని, వికాసమంటే స్వజీవితం ఆనందంగా ఉండటం కాదని, మనతో ఉన్న ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలన్నారు. అందరి వికాసమే వికాసం అని, సర్వేపి సుఖినస్సన్తు అనే భారతీయ చింతన అందరూ ఆనందంగా ఉండాలని సూచిస్తోందని వివరించారు. త్వరలోనే భారతదేశం తన పూర్వవైభవం విశ్వగురుస్థానాన్ని అధిరోహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జ్ఞాన పిపాసకు వివేకం తోడై, విజ్ఞానం ప్రపంచ శ్రేయస్సు కోసం అనే భావనతో ఉండాలన్నారు. మానవుల మనస్సే సర్వకార్యసిద్ధికి మూలమని, మన సంకల్పం దఢంగా ఉంటే జ్ఞానసముపార్జన అత్యంత సులభమని తెలియజేశారు. ప్రస్తుతం భారతీయ జ్ఞాన పరంపర- ఐ.కె.ఎస్ ద్వారా భారతదేశంలోని 2000 సంవత్సరానికి పూర్వం మన ఋషులు రచించిన అత్యంత నిగూఢమైన శాస్త్ర సాంకేతిక విషయాలను వెలికి తీస్తూ భావిభారతానికి అందిస్తుందని చెప్పారు. ప్రతి వ్యక్తి శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం పొంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. ఈ బాధ్యత విజ్ఞాన భారతి తన భుజస్కంధాలపై వేసుకుని అధ్యాపకుల్లో, పరిశోధకుల్లో మంచి శాస్త్ర సాంకేతిక విషయాలపై సదస్సులు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని తెలియజేశారు. సంస్కత భాషానిలయమైన సంస్కత విశ్వవిద్యాలయంలో ఈ సదస్సు నిర్వహించడం అత్యంత హర్షణీయమని అన్నారు.

భారతీయ విజ్ఞాన సమ్మేళనం కన్వీనర్, విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి వందనసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి కమీషనర్, జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య ఐ.ఐ.టి, ఐజర్, ఐ.ఐ.ఎమ్ డౌరెక్టర్స్, వైస్-చాన్సలర్స్, ప్రొఫెసర్స్, రీసెర్చ్ స్కాలర్స్, పురప్రజలు పాల్గొన్నారు.



ఇండియాస్ నాలెడ్జ్ సిస్టమ్స్ పుస్తకావిష్కరణ సభలో చంద్రబాబు, మోహన్‌జీ భగవత్

సత్యవేడులో డిఎస్‌పి కార్యాలయం ఏర్పాటు చేయండి

సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలు కలుపుతూ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, డిఎస్‌పి కార్యాలయాలు సత్యవేడులో ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగానారా చంద్రబాబునాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. కెవిబిపురంలో పేదల కోసం టిటిడి కల్యాణ మండపాన్ని నిర్మించాలన్నారు.

సీఎంకు వినతిపత్రం ఇవ్వడం కూడా నేరమా? :కాంగ్రెస్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వడం కూడా నేరమా అంటూ కాంగ్రెస్ నాయకులు పోలీసులను ప్రశ్నించారు. తిరుపతిలో శుక్రవారం భారతీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి, పలు సమస్యలను వినతిపత్రం ద్వారా తీసుకు వెళ్లడానికి ప్రయత్నించిన తమను పోలీసులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి, అగ్రికల్చరల్ యూనివర్సిటీ బయట వదిలివేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని రోజుకు 20వేల మందికి దర్శనం కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకు వెళ్లడానికి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడుపేరు చిట్టిబాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులుతో కలిసి వెళ్లే ప్రయత్నం చేయగా బలవంతంగా అరెస్టు చేసి అక్కడ నుంచి తరలించారన్నారు.

సిఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

ఎస్‌వి అగ్రికల్చర్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ఘన స్వాగతం, వీడ్కోలు లభించింది.





టిటిడి పరిపాలనా భవనం ఎదుట కొనసాగుతున్న దీక్షలు

టిటిడి పాలకమండలిని ముట్టడిస్తాం

493వ రోజుకు చిరువ్యాపారుల నిరసనదీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే లైసెన్స్ ఇవ్వాలని 493 రోజుల నుంచి నిరసన దీక్ష చేస్తున్నారు. ఆ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం తిరుమల తిరుపతి పరిపాలన భవనం ఎదురుగా నిరసన జరిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఎస్ జయచంద్ర, టి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారస్తులకు లైసెన్స్ ఇవ్వాలని గత 493 రోజుల నుంచి నిరసన దీక్ష చేస్తున్నా ప్రభుత్వం, టిటిడి పాలకమండలి పట్టించుకోవడం లేదన్నారు. అనేకమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. 30 కుటుంబాల వారు అన్నమో రామచంద్ర అంటూ ఆకలితో అలమటిస్తున్నారన్నారు. వారి కుటుంబాలు వీధినపడ్డాయని, బిడ్డల చదువు ఆగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి మెట్టు యూనియన్ నాయకులు మధు యుగంధర్, చిరంజీవి ప్రకాష్,పెంచలయ్య రామ్మూర్తి, మల్లికార్జున, గోపి రాంబాబు, గణేష్, సోను తదితరులు పాల్గొన్నారు.

నాన్ ఆప్కాస్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలి

ప్రజాశక్తి - నాయుడుపేట

నాన్ ఆప్కాస్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిటీ నియామకం చేయాలన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ సిబ్బందికి నాన్ ఆప్కాస్ సిబ్బందికి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. గత జూలై నెల సమ్మె కాలానికి వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించిన జీవో వెంటనే ఇవ్వాలన్నారు. 2023 డిసెంబర్ 26వ తేదీ నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ఆనాటి ప్రభుత్వంతో అనేక ఒప్పందాలు కుదిరాయన్నారు. ఒప్పందాలలో భాగంగా



ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ అవుతున్న వారికి 10 సంవత్సరములు సర్వీస్ ఉంటే 75 వేల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని ఒప్పందం కుదిరిందన్నారు. ఆపైన ఏడాదికి 2000 చొప్పున ఇస్తామని ఒప్పందం కుదిరిందని అన్నారు. రిటైర్మెంట్ కి సంబంధించిన జీవో వెంటనే ఇవ్వాలని అన్నారు. ఎక్స్గ్రేషియా ఐదు లక్షల నుండి ఏడు లక్షలకు పెంచుతామని ఒప్పందం కుదిరిందని అన్నారు. జీవో మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని వెంటనే జీవో జారీ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు డిఏ బకాయిలు సరెండర్ లీవ్ ఎన్కాష్మెంట్ మొదలగునవి ఇవ్వాలన్నారు. ఎన్ఎంఆర్‌లకు గత ఏడేళ్లుగా జీతాలు పెంచలేదన్నారు. వారికి 21 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ యూనియన్ నాయకులు కాలేషా, సురేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఎన్జీవో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎన్జీవో తిరుపతి జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎన్జిఒ అసోసియేషన్ తిరుపతి జిల్లా ఎన్నికలు తిరుపతి ఎన్జీవో హోంలో కోలాహలంగా నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్ర పరిశీలకులుగా కె జగదీష్ వ్యవహరించారు, శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు వరకు జరిగింది. 17 పోస్టులకు గాను ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో, ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి వేణు గోపాల్ రెడ్డి ప్రకటించారు. ఈ ఎన్నికలలో తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఎస్ సురేష్ బాబు, సహ అధ్యక్షులుగా సిఎం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎం శ్రీనివాసులు, చలపతి నాయక్, గిరిబాబు, ఎస్ నాగరాజు కుమార్, హేమగిరి, మహిళ ఉపాధ్యక్షురాలుగా సి.ప్రేమలత, జిల్లా కార్యదర్శిగా సి. రఘు, కార్య నిర్వహక కార్యదర్శిగా రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎల్ శ్రీరాములు, ఎస్ శ్రీధర్, కె.వి లోకనాథ్ బాబు, చెన్నకేశవులు, వై. మైథిలి, సంయుక్త కార్యదర్శి కార్యదర్శిగా సి. పద్మజ, తిరుపతి జిల్లా కోశాధికారిగా వి.సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం వీరి చేత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, వెంకట్, నిత్య పూజారి, రాఘవులు, రమేష్, వర్మ, రామకృష్ణ, తిరుపతి జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

సైకో వీరంగం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల కొండ కిటకిటలాడుతోంది. ఎక్కడ చూసినా భక్తులే.. భక్తులతో తిరుమల కొండ రద్దీగా ఉన్న సమయంలో.. ఓ సైకో ఉరుకులు పరుగులు పెట్టించాడు. శుక్రవారం మధ్యాహ్నం.. తిరుమల కొండపై.. బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పిచ్చి పిచ్చిగా ప్రవర్తించాడు. చేతిలో కత్తి పెట్టుకుని.. భక్తుల వెంట పరిగెత్తాడు. కత్తితో పొడుస్తా.. చంపుతా అంటూ కేకలు వేస్తూ.. భక్తుల వెంట పడ్డాడు. ఈ సైకోగాడి చేష్టలతో భక్తులు పరుగులు పెట్టారు. భక్తుల పరుగులతో వెంటనే అలర్ట్ అయ్యారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు సైకోను పట్టుకున్నారు. అతని దగ్గర ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. బెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చానని చెబుతున్నాడు. పేరు అడిగితే ఏదేదో చెబుతున్నాడు. బిత్తర చూపులు, చేష్టలతో అతనికి మతిస్థిమితం లేదని తెలుస్తుంది. మిగతా వివరాలు సేకరించి వాళ్ల కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తామంటున్నారు పోలీసులు. మళ్లీ బయటకు వెళితే ఏం చేస్తాడో ఏమో అనే భయంతో.. తిరుమల కొండపై ఉన్న వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించి.. అక్కడే ఉంచారు.



పోలీసుల అదుపులో సైకో

కెవి చౌదరిని సత్కరించిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా విశిష్ట అవార్డు అందుకున్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.వి చౌదరిని తిరుపతిలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు సత్కరించారు. ప్రజా డైరీ మాసపత్రిక 25సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఆయనకు విశిష్ట అవార్డు అందింది. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సమితి కన్వీనర్ కుప్పల గిరిధర్ మాట్లాడుతూ బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులైన కె.వి చౌదరి ఈ అవార్డు రావడం పట్ల తమకెంతో గర్వకారణమని అన్నారు. కె.వి చౌదరి చాంబర్ ఆఫ్ కామర్స్ తో పాటు, హెూటల్ అసోసియేషన్ , బ్రిక్స్ అసోసియేషన్‌లోనూ అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్.వేణుగోపాల్ రెడ్డి ఫిల్మ్ సొసైటీ చైర్మన్, ప్రెసిడెంట్ వై. ఎస్ బాబు, బుజ్జి బాబు నాయుడు , వైయస్ రాజు పాల్గొన్నారు.

వంగవీటి రంగా చిరస్మరణీయుడు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాధ - రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో వంగవీటి రంగా 38వ వర్ధంతి సందర్భంగా నాలుగుకాళ్ళ మండపం వద్ద శుక్రవారం ఉదయం అన్నదానం నిర్వహించారు. రంగా చిత్రపటానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వంగవీటి రంగా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల అభివద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టిడిపి క్లస్టర్ ఇన్చార్జి పులిగోరు మురళీ, కార్పోరేటర్ పొన్నాల చంద్రా, రాధా -రంగా మిత్రమండలి నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ దగ్గర జేసీ అలుమ్ని క్లబ్ వారి ఆధ్వర్యంలో జేసీ డాక్టర్ సయ్యద్ సుమయ్య సహకారంతో ఉచితంగా పేదలకు అల్పాహారం అందించారు. సుమారు 350 మందికి అందించారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్‌కుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఎం.వేణుగోపాల్‌రెడ్డి,ఎస్.బుజ్జిబాబునాయుడు పాల్గొన్నారు.

శ్రీరామలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యం-2025 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చాలా కాలం తర్వాత తాము చదివిన కళాశాలలో తోటి విద్యార్థులతో కలిసి ఒక్క వేదికను పంచుకోవడం అపూర్వ జ్ఞాపకానికి నాంది పలికిందని పలువురు పూర్వ విద్యార్థులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీ రామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్యం రామిరెడ్డి మాట్లాడుతూ ఎంతో ఉన్నత ఆశయంతో 2008వ సంవత్సరంలో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించామని, కళాశాలలో విద్యార్థులు సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్, బ్యాంకింగ్ సెక్టార్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలలో ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉన్నత స్థాయికి చేరిన శ్రీరామ పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడం కోసం కళాశాలకు రావడం అభినందనీయమని,



శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యం-2025

నేడు కళాశాలలో మారుతున్న ఆధునిక విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతికతలో మార్పులు, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ శ్రీరామ కళాశాల నేడు స్వయం ప్రతిపత్తి హెూదా కలిగి జాతీయ స్థాయిలో నాక్ గుర్తింపు పొందింది అన్నారు. విద్యార్థులు తాము పాఠ్యాంశాలు విన్న తరగతి గదులలో కలియ తిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను తోటి విద్యార్థులతో నెమరు వేసుకున్నారు. కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వాసు, కన్వీనర్ డాక్టర్ కె. స్వప్న సుధా, అలుమిని సెక్రటరీ కె. యోగితబాలి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అనీల్‌కు ఎఫ్ఏసీ ఇవ్వరా..!!

శ్రీకాళహస్తి రెవెన్యూ సమస్యల పుట్ట

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయంలో సమస్యలు పేరుకు పోతున్నాయి. రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో పీజిఆర్ఎస్ అర్జీలతోపాటు భూ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. శ్రీకాళహస్తి తహశీల్దారు జనార్ధన్ రాజు తిరుపతి రూరల్ కు బదిలీ అయ్యి నేటికి 18 రోజులు గడుస్తున్నా ఇప్పటిదాకా రెగ్యులర్ తహశీల్దారును ప్రభుత్వం నియమించలేదు. దీంతో ఏడిటీగా ఉన్న ఏ.అనిల్ కుమార్ ను ఇన్చార్జి తహశీల్దారుగా నియమించారు. ఆయనకు శ్రీకాళహస్తి ఆర్డీవో పరిమిత అధికారాలు మాత్రమే ఇవ్వడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకే పరిమితమయ్యారు. దీంతో భూ సమస్యలకు పరిష్కారం దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఏడిటీ అనిల్ కు జిల్లా కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించినా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే రెగ్యులర్ తహశీల్దారునైనా నియమించాలని కోరుతున్నారు. తిరుపతి జిల్లాలోనే అతిపెద్ద మండలంగా పేరున్న శ్రీకాళహస్తికి మూడు వారాలుగా రెగ్యులర్ తహశీల్దారును నియమించకపోవడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ముక్కంటి సేవలో జడ్జి వీరేందర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పంజాబ్, హర్యానా రాష్ట్రాల హై కోర్టు జడ్జి వీరేందర్ అగర్వాల్ శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదంపండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధి పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధి కార్యక్రమాలపై ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్సి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్రాంతి లోపు త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్‌స్టేషన్, రంగంపేట స్కూలు నిర్మాణం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (50 పడకలు) తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా డిఆర్డీఏ పిడి శోభన్ బాబు, డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు ప్రసాద్ రావు, దశరథరామి రెడ్డి, ఐసిడిఎస్ పిడి వసంత బాయి, జిల్లా విద్యా శాఖ అధికారి కెవియన్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ లోకనాథం పాల్గొన్నారు.



ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు



ఉత్సవాల్లో డప్పు కొడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్వాతంత్ర పోరాటంలో వీరోచిత పోరాటం చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం సిపిఐ శతాబ్ది శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిరుపతి సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో బైరాగి పట్టెడ రాయలసీమ కాలేజీ నుండి రామానాయుడు స్కూల్, పద్మావతి పార్క్ మీదుగా సిపిఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం జె విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ భూ పోరాటంలో లక్షలాది ఎకరాలు ఆక్రమించి పేదలకు పంచి పెట్టడం జరిగిందన్నారు. రాజకీయాలను ప్రభుత్వాలు భ్రష్టు పట్టిస్తున్నాయని విద్యార్థి సంఘాలకు ఎన్నికలు ఉన్నప్పుడు ఎంతో మంది రాజకీయ నాయకులుగా ఎదిగారన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు రద్దు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. రూ.10 లక్షల కోట్లు పేదల ఉపాధి కి ఖర్చు చేసిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల కోసం 28 లక్షల కోట్లు మాఫీ చేశారు అని విమర్శించారు. ఉపాధి హామీ పథకం పేరు ఎందుకు మారుస్తున్నారో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలన్నారు. అటవీ భూములను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మతోన్మాద బిజెపి శక్తులపై పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపును ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులకు కాలం చెల్లింది అని చెప్పేవారు పదే పదే ఎందుకు కమ్యూనిస్టుల గురించి ప్రస్తావిస్తున్నారు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చారులత, జె నాగరాజు,నాగభూషణం, డప్పు సూరి, ఫ్లూట్ సుబ్బు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే ఎర్రజెండా లక్ష్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగలో ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ వద్దనున్న సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమసమాజ లక్ష్యంగా సాగుతున్న సిపిఐ మరింత బలోపేతమై రాజ్యాంగ హక్కుల రక్షణకై ఉద్యమిస్తుందని తెలియజేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గంతో పాటు ప్రజలందరూ సంఘటితమై నడవాల్సిన అవసరం ఉందన్నారు.

గూడూరును జిల్లా కేంద్రం చేయాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మైకా గనులకు, నిమ్మ పంటకు గూడూరు పెట్టింది పేరని దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. అటువంటి ప్రాశస్త్యం ఉన్న గూడూరును జిల్లా కేంద్రం చేయాలని కోరారు. గూడూరు, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో అపార ఖనిజ వనరులు, రైల్వే జంక్షన్, అనేక పరిశ్రమలు ఉన్నాయన్నారు. గూడూరును జిల్లా కేంద్రంగా మార్చేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి గూడూరు వాసుల కల నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారావు, పూల చంద్రశేఖర్, సుబ్బరామరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యత ప్రధానం

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, మొగరాల ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కాప్స్ – మిషన్ లైఫ్ ఏకో క్లబ్స్, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా "నా చెట్టు – నా ఆరోగ్యం" కార్యక్రమాన్ని గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకట సిద్దులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకట సిద్ధులు ఎన్జీసీ విద్యార్థులచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రెడెప్ప మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సుస్థిర పర్యావరణ లక్ష్య సాధనకు పనిచేయాలన్నారు. పర్యావరణ సమతుల్యతకోసం దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి సాధించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో జనవిజ్ఞాన వేదిక, ఎన్జీసీ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుల్తాన్, నీరజ, రామమూర్తి, ప్రభోధిని తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామం.. నారావారిపల్లె

ప్రజాశక్తి - చంద్రగిరి: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం నారావారిపల్లి గ్రామపంచాయతీని సర్పంచ్ లక్ష్మీ అధ్యక్షతన అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల సంబంధించిన డిప్యూటీ ఎంపిడీవోలు, ఏవోలు పరిశీలించారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అక్కడ అమలు చేస్తున్న అభివృద్ధి పనులను ఇతర జిల్లాలలో నిర్వహించడానికి ఈ పర్యవేక్షణ రూపొందించారు. ఈపిటీసీ శ్రీకాళహస్తి సీనియర్ ఫ్యాకల్టీ రమేష్, అమర్నాథ్, మధుసూదన్, ఎంపీడీవో వెంకటరత్నం ఆధ్వర్యంలో నారావారిపల్లెలో చేపడుతున్న సోలార్ ఎనర్జీ, సంజీవని, డ్రోన్ ఆధారిత వ్యవసాయం, అగ్రి ఏటీఎం వంటి వాటిని అధ్యయనం చేశారు. నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు, ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను డిప్యూటీ ఎంపిడీవోలు సందర్శించారు. డ్రోన్ ఆధారిత వ్యవసాయం, సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు, మోడల్ విలేజ్ ప్రాజెక్టు అమలుకు కావాల్సిన అవసరాలని ప్రత్యక్షంగా పరిశీలించారు.

పల్లికొండేశ్వరాలయ బోర్డు సభ్యులకు సన్మానం



ప్రజాశక్తి - నాగలాపురం: మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయ పాలక మండలి సభ్యులు హంస రుద్రయ్యను శుక్రవారం జాతీయ కాపు సంఘం ప్రధాన కార్యదర్శి, పుత్తూరు కాపు సంఘం నాయకులు గోపి రాయల్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు నాగలాపురం మండల కాపు సంఘం నాయకులు ఆలో బాలాజీ, కన్నయ్య, దాగూరుకు ఘన స్వాగతం పలికి ఆలయంలో దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం ఆలయ వెలుపల జరిగిన నూతనంగా ఎన్నికైన కాపు సంఘానికి చెందిన పల్లికొండేశ్వర ఆలయ పాలక మండలి సభ్యులు హంస రుద్రయ్య నాయుడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో నగరి నియోజకవర్గ జాతీయ కాపు సంఘం అధ్యక్షులు బాబు రాయల్, కాపు సంఘం నాయకులు కృష్ణయ్య, శేఖర్ రాయల్, మణిరాయల్, అయ్యప్ప రాయల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే 'జనబాట'



ప్రజాశక్తి - రామచంద్రపురం: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్తును అందించడి, విద్యుత్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన బాట కార్యక్రమానికి విద్యుత్ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు రామచంద్రాపురం, మిట్టూరు, ఆరోని పురం ఎస్సీ కాలనీ గ్రామాలలో ఏఈ వివేక్ గిరి, విద్యుత్ సిబ్బంది జనబాట కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రాపురంలో విద్యుత్తు లైన్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులు, విద్యుత్ వినియోగదారులను కలసి విద్యుత్ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్న సమస్యలు విద్యుత్ సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని, పెద్దలు సమస్యలైతే ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అసిస్టెంట్ ఎక్జ్యూటివ్ ఇంజనీర్ వివేక్ గిరి తెలిపారు. ఈ జనబాట కార్యక్రమంలో రెండు చోట్ల లూజు విద్యుత్ లైన్లు, రెండు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని గుర్తించినట్లు విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీపతి తెలిపారు. ఈ జనబాట కార్యక్రమంలో వెంకట మునీ, సురేష్, దిన్నెష్, విద్యుత్ సహాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి



ప్రజాశక్తి - వెంకటగిరి: శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ 12వ, పిఆర్సి కమిటీ నియామకం చేయాలన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. గత జూలై నెల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల వివిధ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండగా మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. చట్టబద్ధమైన సెలవులు, రక్షణ పరికరాలు ఇవ్వాలని అన్నారు. సిబ్బందిని పెంచి, పనిభారం తగ్గించాలన్నారు. పారిశుద్ధ్య మేస్త్రీ గా పని చేస్తూ ఆదివారం చనిపోయిన పరమాల సుబ్రహ్మణ్యం కుటుంబంలో వారి కుమారుడికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు టి.సుబ్బయ్య, ఎ. ప్రసాద్, పెంచలయ్య ఇందరమ్మ పెంచలయ్య, కిష్టమ్మ, గోపాల్, నవీన్, టి.రమణయ్య పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



ప్రజాశక్తి - నాయుడుపేట: సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నాయుడుపేట టిడిపి నాయకులతో కలిసి పూలమాలతో ఘన స్వాగతం పలికారు. తిరుపతి పర్యటన నిమిత్తం శుక్రవారం తిరుపతికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సీఎంకు ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు నాయుడుపేట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తాతయ్యగుంట గంగమ్మ సేవలో ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తాతయ్యగుంట గంగమ్మను హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం అనిత తిరుపతి పర్యటన నిమిత్తం రాగా బొజ్జల ఆమెకు స్వాగతం పలికి పర్యటన ఏర్పాట్లు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.


మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సిటిజన్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ విభాగాల్లో శిక్షణ పూర్తి చేస్తున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మహిళలు చేతి వృత్తులపై ప్రావీణ్యత కలిగి ఉంటే తమ కాళ్ళపై తాము నిలబడగలరని చెప్పారు. అమ్మ ఆశ్రమం వ్యవస్థాపకురాలు భూలక్ష్మి, శ్రీకాళహస్తి టూ టౌన్ ఏఎస్ జ్యోతి పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గడువులోగా గిరిప్రదక్షిణ మార్గంలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పూర్తిచేయాలని ఈవో బాపిరెడ్డి సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించారు. శుక్రవారం ఈవో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ నెల 5వ తేదీ లోగా పనులు పూర్తి చేసి దేవస్థానానికి అప్పచెప్పాలని కోరారు. ఇన్చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరెడ్డి, ఏఈ వేణుగోపాల్ రెడ్డి, వర్క్ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, కాంట్రాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల్లో నటుడు సుమన్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ సినీ నటుడు సుమన్ శుక్రవారం నిర్వహించిన దర్గామిట్ట ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది నిర్వహించే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందనీ, ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పారు.

శివ శ్రీనివాస్‌ను కలిసిన ఉయ్యాల ప్రవీణ్



ప్రజాశక్తి - నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్‌ను నాయుడుపేట ఏఎంసి చైర్మన్, సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటనలో పాల్గొని మంగళగిరికి వెళ్తున్న సందర్భంగా ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్‌ను నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్లా కృష్ణారావు, గిండి సతీష్, కుంపటి శ్రీను, తాళ్ల రెడ్డి శ్రీనివాస్, జ్యోతిష్ పలువురు జనసైనికులు కళ్యాణం శివ శ్రీనివాస్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ఆరెపల్లి గ్రామ పంచాయితీలో శుక్రవారం రెవిన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఆరేపల్లె రెవెన్యూ పరిధిలో ఉన్న భూములను రీసర్వే పూర్తి చేశామని, నాగపట్ల రెవిన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ పోరంబోకు, కాలువ, కోనేరు వంటి భూములకు రీసర్వే చేసి హద్దులు గుర్తించి, వాటికి పెన్సింగ్ రాళ్లు కూడా నాటామని డిప్యూటీ తహశీల్దార్ దివాకర్ తెలియజేసారు. కానీ నాగపట్ల రెవిన్యూ పరిధిలో ఉన్న పట్టా ఉన్న భూములకు మాత్రమే రీసర్వే చేస్తామని తెలిపారు. రెవిన్యూ అధికారి చెప్పిన వెంటనే రైతు కృష్ణయ్య, గ్రామస్తులు గతంలోనూ, ఇప్పుడు కూడా ప్రభుత్వ పరంబోకు, కాలువ, కోనేరులు అన్యాక్రాంతామయ్యాయని, వాటి జాడలు కూడా తెలియడంలేదని రెవిన్యూ అధికారులను నిలదీసాడు. రెవిన్యూ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ పరిధిలో ఉన్న భూములన్నీ కూడా ఆన్లైన్ చేసారని, ఇందులో తప్పోప్పులకు ఆస్కారం లేదని డిప్యూటీ తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు మాజీ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, గ్రామ పెద్ద నాగిరెడ్డి, సుబ్బారామిరెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, చంద్రగిరి మండల వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లంకొండ రమేష్, తెలుగుదేశం యువత అధ్యక్షులు దేవీలాల్, క్లస్టర్ మబ్బు జ్ఞానశేఖర్, సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.కె బాబు శుక్రవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పథకంలో తిరుపతి కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నిధులతో పనులు చేపట్టారని, అవి అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. ఈ భవనం పూర్తి చేయడానికి సుమారు 50 కోట్ల రూపాయలు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సీఎం వినతిపత్రం తీసుకొని కార్పొరేషన్ కొత్త కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహ చారి, కుడితి సుబ్రమణ్యం టిడిపి నేతలు పాల్గొన్నారు.

పనిచేసిన వారికే పదవులు : డిప్యూటీ మేయర్ మునికృష్ణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : టిడిపి పార్టీకి కష్టపడి పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని డిప్యూటీ మేయర్ మునికృష్ణ స్పష్టం చేశారు. టిడిపి తిరుపతి పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా జెడబ్ల్యూ విజయకుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికష్ణను కలిశారు. ఈ సందరభంగా మునికృష్ణ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ సెక్రటరీ జెడబ్ల్యూ విజయ్ కుమార్‌కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్, రామచంద్ర రెడ్డి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికుల న్యాయపరమైన పలు సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని జిల్లా కమిటి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తిరుపతి జిల్లా గూడూరు, మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎ.పి.మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ పెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పి.ఆర్.సీని వెంటనే అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని, సమ్మె కాలపు జీతం చెల్లించాలని, రిటైర్‌మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, ఇంకా అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, గూడూరు మణి, ఏ.శాంతి వర్ధన్, జి.మేరీ,పి.పెంచలమ్మ, కే.పద్మమ్మ, సి.హెచ్.శుభరత్నమ్మ, సి.ఐ.టి.యు నాయకులు జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, గండికోట మధు, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్రను సన్మానించిన టిడిపి నేత రాజేష్



ప్రజాశక్తి - నాయుడుపేట: టీడీపీ నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షులుగా ఎన్నికైన టిడిపి సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ బీద.రవిచంద్రను నాయుడుపేట టీడీపీ నాయకులు, ఎస్.జె జ్యూవలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం నెల్లూరు, టీడీపీ కార్యాలయంలో, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వర్లుకు టిడిపి నేత పోట్లపూడి రాజేష్ శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

మిస్ ఆంధ్రప్రదేశ్‌కు సత్కారం



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించగలరని మిస్ ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికై ఘమన సాత్వికి మరోసారి నిరూపించిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణపేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఘమన సాత్వికకు నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫరెవర్ స్టార్ ఇండియా సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి అందాల పోటీల్లో మిస్ ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికై, దేశవ్యాప్తంగా నాలుగో స్థానంలో నిలిచి రాష్ట్ర ఖ్యాతిని సాత్విక దేశమంతా చాటిందని కొనియాడారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ప్రముఖులు పాల్గొని ఘమన సాత్వికను ఘనంగా సన్మానించి ఆమె విజయానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఘమన సాత్విక మాట్లాడుతూ 2027లో జరిగే మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు.

వెంకటగిరి అభివృద్ధికి సీఎం భరోసా : ఎమ్మెల్యే కురుగొండ్ల

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: సుదీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని వెంకటగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెనుకబాటు, నిరుద్యోగం, మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలు వెంకటగిరి అభివృద్ధికి అడ్డంకిగా మారాయని వివరించారు. ముఖ్యంగా రహదారులు, తాగునీటి సరఫరా, సాగునీటి వసతులు, వైద్య, విద్యా రంగాల్లో సమగ్ర అభివృద్ధి అవసరమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోని సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు అవసరమని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంకటగిరి నియోజకవర్గ అభివ ృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.


అడిషనల్ కమిషనర్‌గా శారదా దేవి నియామకం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా శారదా దేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులను జారీ చేసింది. ఇక్కడ అడిషనల్ కమిషన్‌గా పనిచేసిన చరణ్ తేజ్ రెడ్డి మాతృ సంస్థ అయిన ఆడిటింగ్ విభాగానికి బదిలీ ఐదు నెలలు అవుతుంది. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ టిడ్కోలో పనిచేస్తున్న శారదా దేవిని నియమించడం జరిగింది.

సిఐటియు వినతికి స్పందించిన టిటిడి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: టిటిడిలో ఎఫ్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు డ్యూటీ సమయంలో దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గది కేటాయించాలని జూలై 9వ తేదీన చేపట్టే సమ్మె నోటీస్‌లో డిమాండ్ పెట్టడం జరిగింది. టిటిడి అధికారులు స్పందించి మహిళా కార్మికులకు దుస్తులు మార్చుకోవడానికి గదులు కేటాయిస్తామని ఎఫ్ఎంఎస్ అధికారులు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం శుక్రవారం వెస్ట్ ప్యాకేజీలు గదిని కేటాయిస్తున్నట్లు ఎఫ్ఎంఎస్ అధికారులు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. తిరుమలలో అన్ని ప్యాకేజీలలో కూడా రూములు కేటాయించాలని కోరుతున్నామని, సిఐటియు వినతికి ఎఫ్ఎంఎస్ అధికారులు స్పందించి రూము కేటాయించినందుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు సిఐటియు నాయకులు తెలిపారు.

విజిలెన్స్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిజిపి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తిరుపతి యూనిట్‌లో ఫైల్స్ తనిఖీ చేసి సంతప్తి వ్యక్తం చేశారు. విచారణ లపై సంతప్తి వ్యక్తం చేశారు. తిరుపతి విజిలెన్స్ ఎస్‌పి కరిముల్లా, షరీఫ్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబమే కళలు

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: భారతీయ సంస్క ృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలాచేసేవే మన కళలు, కళారూపాలని తిరుపతి జనసేన పార్టీ సీనియర్ నాయకులు బండ్ల లక్ష్మీపతి తెలిపారు. తిరుపతి శ్రీకృష్ణ నటనాలయం కల్చరల్ డెవలప్మెంట్ అకాడమీ కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య కొండా రవి ఆధ్వర్యంలో శుక్రవారం మహతి ఆడిటోరియం వేదికగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన సీనియర్ నాయకులు బండ్ల లక్ష్మీపతి, అతిథులుగా రేణిగుంట ఎంఎ జబ్బార్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, సామాజిక సేవకుడు సిద్దయ్య, అంతర్జాతీయ బహుభాషా నాటక కళాకారుడు "ఆల్ ది బెస్ట్" ఖాదర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రజా సాధికారిక ట్రస్ట్ అధ్యక్షులు బాలాజీ నాయక్ అన్నారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేడాం భైరవ ఎస్టీ కాలనీలో ప్రజా సాధికారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేశారు. భూమిహిత–పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. భావితరాల మనుగడకు కాలుష్య రహిత సమాజాన్ని అందించాలని సూచించారు.

రసాయన శాస్త్ర అధ్యయనంతో అపార అవకాశాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : రసాయన శాస్త్ర అధ్యయనంతో అపార అవకాశాలు ఉన్నాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం రసాయనశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం 'ఇంటర్మీడియట్ తర్వాత రసాయన శాస్త్రంతో అవకాశాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. అర్హత పరీక్షల ద్వారా అధ్యాపకులుగా వివిధ రంగాల్లో మంచి అవకాశ్లాఉన్నాయని తెలిపారు.

క్రైం న్యూస్

మృతదేహం లభ్యం



మృతుడు సుబ్రమణి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఒకటవ పట్టణ పరిధిలోని సొసైటీ ప్రాంతం, వరద నగర్ వద్ద మృతదేహం లభ్యమైనట్లు గూడూరు ఒకటవ పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మృతుడు చిత్తూరు జిల్లా, పలమనేరుకు చెందిన సుబ్రమణి (34)గా గుర్తించామన్నారు. మృతుడు గత ఒకటిన్నర సంవత్సరం నుండి సొసైటీలోని వరద నగర్ కాలనీలో సి.ఆర్. రావు సర్వెంట్ క్వార్టర్స్‌లో అద్దెకు ఉంటూ టైల్స్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మృతుడు కొద్ది రోజులుగా శ్వాస సమస్యతో బాధపడుతున్నట్లు మృతుడికి తెలిసిన పురంధర్ అనే వ్యక్తి తెలిపినాడన్నారు. మృతుడు తను అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద నుంచి నడుచుకుంటూ వస్తూ పక్కనే ఉన్న ముళ్ళకంపల్లో పడిపోయాడని తెలిపారు. మృతుడు శరీరంపై గాయాలు లేవన్నారు. మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆసు పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు–తిరుపతి రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఓ ఆటో డ్రైవర్ వీరంగం సృష్టించాడు. మద్యం సేవించి ఆటో నడుపుతూ రోడ్డుపై అడ్డంగా వాహనం నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఇదేమని స్థానికులు ప్రశ్నించగా ఆటో డ్రైవర్ ఆవేశంగా ప్రవర్తించడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మత్తులో వాహనాలు నడిపితే ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువులో మృతదేహం



మృతురాలు జయం సుందరమ్మ

ప్రజాశక్తి - చిట్టమూరు : చిట్టమూరు మండలం, మల్లం గ్రామ చెరువులో వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు మృతురాలు మల్లం గ్రామానికి చెందిన వెంకటయ్య భార్య జయం సుందరమ్మ (85)గా గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని వెలికి తీసి, కేసు నమోదు చేసి శవ పంచనామ నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. వివరాలు విచారణలో తేలాల్సిఉందని పోలీసులు తెలిపారు.

ఎస్వీయూ అసోసియేట్ ప్రొఫెసర్ అనుమానాస్పద మృతి



సర్దార్ గుగులోతు నాయక్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఎంబిఏ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ సర్దార్ గుగులోతు నాయక్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం వర్సిటీలో కలకలం రేపింది. తన సొంత కారులోనే పడుకొని మ ృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటన జరిగిన రెండు రోజుల పాటు ఎవరికీ తెలియకుండా ఉండగా, స్థానికులు కారులోని మ ృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా హాస్పిటల్‌కు తరలించారు. మృతికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉండగా, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సర్దార్ నాయక్ స్వస్థలం మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, తండ ధర్మారంగా గుర్తించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, సహోద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అనుమానాస్పద మృతి కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

ఎస్వీయులో పలువురి నివాళి

యస్వీయు, ఎం.బి.ఏ. విభాగంలో ఆచార్యుడిగా పనిచేస్తున్న సర్దార్ గుగలోత్ మృతిక ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబసభ్యులకు ధైర్యం తెలిపారు. కాగా 2007 నుండి గుగలోత్ యస్వీయూలో పనిచేస్తున్నారు. సంతాప సూచకంగా శుక్రవారం విశ్వవిద్యాలయంలో తరగతులు రద్దయ్యాయి.

ఎమ్మెల్యేకి రుణపడి ఉంటా : మహేష్

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని బోడెవాండ్లపల్లి పంచాయతీకి చెందిన పులిచెర్ల మహేష్ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన టిడిపి నాయకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. దళితులకు ప్రాధాన్యత నిస్తూ పార్లమెంట్ స్పోక్స్ పర్సన్‌గా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే నానికి రుణపడి ఉంటానన్నారు. ఇచ్చిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తలకోన చైర్మన్ సోమనాథ్ రెడ్డి, రాష్ట్ర రజక డైరెక్టర్ మధు, విశ్వనాథరెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్, వెంకట శివరాం రెడ్డి, బీవీ రెడ్డి తదితర మండల నాయకులు ఎమ్మెల్యే నాని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

త్రోబాల్ జట్టుకు సత్కారం



ప్రజాశక్తి - పిచ్చాటూరు: జిల్లా స్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో పిచ్చాటూరు మండలానికి చెందిన త్రోబాల్ జట్టు విజేతగా నిలిచి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మహమ్మద్ రఫీ, మండల విద్యాశాఖాధికారులు కే హేమమాలిని, ఎంఈఓ 2 యుగంధర్ రాజు విజేతలైన త్రోబాల్ జట్టును సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమంలో పిచ్చాటూరు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొని జట్టుకు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఈ జట్టు, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి తిరుపతి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎంఈఓ ను, ఎంపీడీవో ఆకాంక్షించారు. ఉపాధ్యాయులలో క్రీడాస్ఫూర్తి, ఐక్యత, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని వారు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే త్రోబాల్ జట్టు మరింత ఉత్సాహంతో సాధన చేసి విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇమాం మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పుత్తూరు గేట్ పుత్తూరు మస్జిద్ ఏ.ముఖద్దస్ ఇమాం సాహెబ్ షోఖత్ అలీ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల పుత్తూరు పట్టణం గేట్ పుత్తూరు ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.